సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం । 16 । జనవరి । 2025



పందేనికి పోతే.. పైసా పాయే
కోడి పందేలు చూసేందుకు సరదాగా ఏపీకి వెళ్లిన వారు కూడా పందేలు కాసి, చేతి చమురు వదిలించుకున్నారు.
8లో



మాంజా.. యమ డేంజర్
సంక్రాంతి సందర్భంగా పలువురు గాలి పటాలు ఎగురవేస్తుండగా, వాటికి ఉండే మాంజా ప్రమాదంగా మారుతోంది.
8లో



వాతావరణం
జిల్లాలో గురువారం మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు అధికంగానే ఉంటాయి. రాత్రి వేళ చలి ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

ఘనంగా గోదా కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ) : అన్నపురెడ్డిపల్లిలోని శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం గోదారంగనాథస్వామి వార్ల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాదాచార్యుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా వేడుక జరిపించగా వందలాది మంది భక్తులు తిలకించారు. ఆలయ మేనేజర్ పీవీ రమణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మూడు జిల్లాల స్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న హెచ్‌ఎం నాగమణి

ఇల్లెందురూరల్: ఇల్లెందు మండలం బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీ పరిధి కొల్లాపురంలో యంగ్‌స్టార్ యూత్ ఆధ్వర్యాన మూడు జిల్లాల స్థాయి వాలీబాల్ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను బొజ్జాయిగూడెం ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం నాగమణి, గ్రామపెద్దలు ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ క్రీడగా పేరొందిన వాలీబాల్ పోటీలను 48ఏళ్లుగా ఏటా సంక్రాంతి సందర్భంగా నిర్వహిస్తుండడం అభినందనీయమని పేర్కొన్నారు. కాగా, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల నుంచి పోటీలకు జరైన క్రీడాకారులకు మాజీ సర్పంచ్ చీమల వెంకటేశ్వర్లు దుస్తులు అందజేశారు. ఈకార్యక్రమంలో చీమల రామ్మూర్తి, చీమల లక్ష్మయ్య, మండల వెంకన్న, ఉపేందర్, బుగ్గ వెంకటేశ్వర్లు, గంట శ్రీను, ఆదినారాయణ, కుంజ రాంచందర్, యరపతి, మల్లేష్, చీమల రాము, బొర్ర భద్రయ్య, చీమల గోపాల్, చీమల బిక్షం, కొర్స కోటయ్య, ఆవుల ముత్తయ్య, ఆవుల గోపి, పంచాయతీ కార్యదర్శి పాషా పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో మకరజ్యోతి దర్శనం

పాల్వంచరూరల్ : మకర సంక్రాంతిని పురస్కరించుకుని స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం మకరజ్యోతి దర్శనం వైభవంగా సాగింది. అయ్యప్ప మాలధారులతో పాటు పలువురు భక్తులు హాజరై జ్యోతి దర్శనంతో పులకించిపోయారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు మేడిద సంతోష్, కనగాల రాంబాబు, బండెల శ్రీనివాస్, కాల్వ భాస్కర్‌రావు, మిర్యాల కమలాకర్ పాల్గొన్నారు.

వైభవం.. సంక్రాంతి సంబరం..



చుంచుపల్లి : కొత్తగూడెంలో ముగ్గు వేస్తున్న యువతి



దమ్మపేట : సరిహద్దు ప్రాంతమైన ఏపీలో జరిగిన కోడి పందేలను వీక్షిస్తున్న మండల వాసులు



కొత్తగూడెంలో డూడూ బసవన్నల సందడి..

జిల్లాలో సంక్రాంతి వేడుకలు ముగిశాయి. పల్లె, పట్టణం తేడా లేకుండా మూడు రోజుల పాటు ఎక్కడ చూసినా సందడి వాతావరణం కనిపించింది. లోగిళ్లలో రంగురంగుల ముగ్గులు, గొబ్బెమ్మలు, గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల సంకీర్తనలు, గాలిపటాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ధనుర్మాస పూజలు, గోదారంగనాథస్వామి వార్ల కల్యాణ వేడుకలతో ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. ఇళ్లలో పిండివంటలు ఘుమఘుమలాడాయి. పలువురు మహిళలు నోములు నోచుకున్నారు. పలు సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కాగా, కనుమ పండుగ సందర్భంగా పశువులకు ప్రత్యేక పూజలు చేసిన రైతులు.. పాడి పంటలు సమృద్ధిగా కలగాలని ఆకాంక్షించారు. ఇక జిల్లాలోని పలు ప్రాంతాల్లో కోడి పందేలు నిర్వహించగా పందెం రాయుళ్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనేక మంది పొరుగునఉన్న ఏపీకి తరలివెళ్లారు.

– కొత్తగూడెంటౌన్ / చుంచుపల్లి

కూనంనేనికి చుక్కెదురు!

ఎన్నికల అఫిడవిట్‌పై అభ్యంతరాలు

- తెలంగాణ హైకోర్టులో దాఖలైన పిటిషన్
- సుప్రీంకోర్టును ఆశ్రయించిన సాంబశివరావు
- అక్కడా ఎమ్మెల్యేకు దక్కని ఊరట



కూనంనేని సాంబశివరావు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. తన ఎన్నికను సవాల్ చేస్తూ తెలంగాణ హైకోర్టులో దాఖలైన పిటిషన్‌ను రద్దు చేయాలని కోరుతూ ఆయన సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదోపవాదాలు విన్న అనంతరం కూనంనేని దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సుప్రీం ధర్మాసనం బుధవారం తోసిపుచ్చింది. ఈ కేసులో వాదనలు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని కూనంనేనికి సూచించింది. ఈ కేసులో గతంలో హైకోర్టు తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీం కోర్టు సమర్థించింది.

మరోసారి తెరపైకి కొత్తగూడెం

ఎన్నికల అఫిడవిట్‌లో వివరాలు, అనర్హత అంశంపై కొత్తగూడెం నియోజకవర్గం మరోసారి వార్తల్లోకి ఎక్కింది. 2018 ఎన్నికల్లో కొత్తగూడెం నుంచి ఎమ్మెల్యేగా వనమా వెంకటేశ్వరరావు గెలిచారు. అయితే ఎన్నికల అఫిడవిట్‌లో ఆయన పూర్తి వివరాలు పేర్కొనలేదంటూ ఆ ఎన్నికల్లో ఓటమి చవిచూసిన జలగం వెంకట్రావ్ 2020లో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దాదాపు నాలుగేళ్ల విచారణ తర్వాత వనమా ఎన్నిక చెల్లదని, ఆ ఎన్నికల్లో రెండో స్థానంలో నిలిచిన జలగం వెంకట్రావును ఎమ్మెల్యేగా గుర్తించాలని 2023 జూలైలో హైకోర్టు తీర్పు వెలవరించింది. అయితే ఈ తీర్పును సవాల్ చేస్తూ వనమా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అక్కడ విచారణ దశలో ఉండగానే 2023 నవంబర్ 30న రాష్ట్రంలో ఆసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో వనమా ఓడిపోగా కూనంనేని సాంబశివరావు గెలిచారు. ఫలితాలు వెలువడిన మరుసటి నెలలోనే కూనంనేని ఎన్నికపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. తాజా సుప్రీంకోర్టు ఆదేశాలతో ఈ నెల 21న వాదోపవాదాలు జరగనున్నాయి.

సమగ్ర వివరాలు వెల్లడించలేదంటూ..

తెలంగాణ అసెంబ్లీకి 2023 నవంబర్‌లో జరిగిన ఎన్నికల సందర్భంగా ఫామ్ – 26 అఫిడవిట్‌లో సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు సమగ్ర వివరాలు వెల్లడించలేదని, ఆయన ఎన్నికపై అభ్యంతరకరమని పేర్కొంటూ 2024 జనవరి 20న కొత్తగూడేనికి చెందిన నందూలాల్ అగర్వాల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కూనంనేని తన భార్య పేరును అఫిడవిట్‌లో పేర్కొనలేదని, లైసెన్స్‌డ్ నోటరీతో అఫిడవిట్ చేయించలేదని అగర్వాల్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ కేసు విచారణ ఈ నెల 21న జరగనుంది. అయితే ఈ పిటిషన్‌ను రద్దు చేయాలంటూ కూనంనేని సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

న్యాయస్థానంపై నమ్మకం ఉంది

ఎన్నికల అఫిడవిట్‌లో లోపాలున్నాయంటూ చేస్తున్న ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని, న్యాయ స్థానంపై నమ్మకం ఉందని, సమగ్రంగా విచారించి క్లీన్ చిట్ ఇస్తుందని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సుప్రీం కోర్టు నిర్ణయంపై బుధవారం ఆయన స్పందించారు. తన ఎన్నికల అఫిడవిట్‌పై తెలంగాణ హైకోర్టులో దాఖలైన పిటిషన్‌ను రద్దు చేయాలని కోరుతూ స్పెషల్ లీవ్ పిటిషన్ ద్వారా సుప్రీంకోర్టును ఆశ్రయించానని, దీనిపై విచారించిన సుప్రీంకోర్టు తన పిటిషన్‌ను రద్దు చేసి హైకోర్టులోనే తేల్చుకోవాలని సూచించిందని పేర్కొన్నారు. ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన వసరం లేదని, నిరాధార పిటిషన్ నిలువబోదని అన్నారు. కొందరి ప్రోద్బలంతోనే నిరాధార పిటిషన్ దాఖలైందని, తన ఐదేళ్ల పదవికి ఎలాంటి ఢోకా ఉండదని ధీమా వ్యక్తం చేశారు. ఎవరూ ఆందోళనకు గురికావద్దని, నియోజకవర్గ అభివృద్ధికి తన సేవలు ఎప్పటిలాగే కొనసాగుతాయని స్పష్టం చేశారు.

నేత్రపర్వం.. రామయ్య నిత్యకల్యాణం





స్వామివారి రథోత్సవంలో అర్చకులు, ఈఓ రమాదేవి (ఇన్‌సెట్) నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్య కల్యాణ వేడుకను బుధవారం నేత్రపర్వంగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ వేడుకను శాస్త్రోక్తంగా గావించారు. భక్తులు భారీగా హాజరై స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కనులపండువగా రథోత్సవం

శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో మకర సంక్రాంతిని పురస్కరించుకుని మంగళవారం రథోత్సవం నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంలో స్వామివారి ఉత్సవ మూర్తులను ఆశీనులు చేసి ప్రత్యేక పూజలు జరిపించారు. ప్రధాన ఆలయం నుంచి తాతగుడి సెంటర్‌లోని గోవిందరాజు స్వామి వారి ఆలయం వరకు తిరువీధి సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా తమ ఇంటి ముందుకు వచ్చిన స్వామివారికి భక్తులు నీరాజనం పలికారు. పూలు, పండ్లు, హారతులు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

అంబసత్రంలో రాపత్తు సేవ

శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో జరుగుతున్న అధ్యయనోత్సవాల్లో భాగంగా రామయ్యకు మంగళవారం పురుషోత్తపట్నంలో, బుధవారం స్థానిక అంబసత్రం(పునర్వసు మండపం)లో వైభవంగా రాపత్తు సేవలు నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాలు, శ్రీరామ నామస్మరణల నడుమ పల్లకీ సేవగా పురవీధుల్లో ఊరేగింపుగా అంబసత్రానికి తీసుకొచ్చారు. అక్కడ వేద పండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు చేసి, హారతి సమర్పించారు.

స్వగ్రామంలో మంత్రి తుమ్మల

దమ్మపేట: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంక్రాంతి సందర్భంగా మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి స్వగ్రామమైన మండలంలోని గండుగులపల్లిలో గడిపారు. మకర సంక్రాంతిని పురస్కరించుకుని ఇంట్లో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం తన నివాసానికి వచ్చిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఆతర్వాత గ్రామంలో కలియతిరుగుతూ బంధువులు, మిత్రుల ఇళ్లకు వెళ్లి పలకరించారు. మాజీ జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు కాసాని నాగప్రసాద్, తుమ్మల శేషుబాబు, కొయ్యల అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు. కాగా, మంత్రి మనవడు ప్రయాస్ మండలంలోని పూసుకుంట వెళ్లి అక్కడ కొండరెడ్లతో మాట్లాడారు. గతంలోనూ ఆయన కొండరెడ్ల ఇబ్బందులను మంత్రిని దృష్టికి తీసుకెళ్లడంతో ఇటీవల విద్యుత్ కనెక్షన్లు, బోరు బావులు మంజూరు చేయించడమే కాక ఆయిల్‌పామ్ మొక్కలను ఉచితంగా అందజేశారు. ఈ నేపథ్యాన గ్రామానికి వచ్చిన ప్రయాస్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.



గండుగులపల్లిలో పర్యటిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

పేదలకు ప్రాధాన్యం కల్పించాలి

- లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలి
- అధికారులకు కలెక్టర్ ఆదేశం

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 26న అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికలో పేదలకు ప్రాధాన్యం కల్పించాలని, ఈ ప్రక్రియ పారదర్శకంగా సాగాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో ఆయా శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లా, మండల స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రభుత్వ నిబంధనలు విధిగా అమలు చేయాలని సూచించారు. ఈనెల 21 నుంచి ఈనెల 24 వరకు గ్రామసభలు నిర్వహించి, ఎలాంటి ఇబ్బందులు రాకుండా లబ్ధిదారుల ఎంపిక పూర్తి కావాలన్నారు. జాబితా తయారీలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. లబ్ధిదారుల జాబితాలను పంచాయతీ కార్యాలయ నోటీస్ బోర్డుల్లో ప్రదర్శించాలని చెప్పారు. రైతు భరోసా పథకం కోసం వ్యవసాయ యోగ్యమైన భూములను గుర్తించాలని, సాగుకు అనువుగా లేని ఇతర భూములను తొలగించాలని సూచించారు. రెవెన్యూ గ్రామాల వారీగా ఏఈఓ, ఆర్ఐ, సర్వేయర్ బృందంగా ఏర్పడి గురువారం నుంచి సర్వే నిర్వహించాలని ఆదేశించారు. దీన్ని తహసీల్దార్, మండల వ్యవసాయాధికారి పర్యవేక్షించాలని చెప్పారు. రైతు భరోసా పథకానికి ఎంపిక చేసిన రైతుల జాబితాను గ్రామ సభల్లో చదివి వినిపించాలన్నారు. ఇతర పథకాలకు కూడా ఇదే పద్ధతి అనుసరించాలని సూచించారు.

ఒకే చోట రేషన్ కార్డు..

దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారికే రేషన్ కార్డులు మంజూరు చేయాలని, ఒక వ్యక్తికి ఒకే చోట కార్డు ఉండేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు కుటుంబాల వివరాలు సేకరించాలని, సమగ్ర వివరాలు తప్పులు లేకుండా నమోదు చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలోనూ పేదలకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. సొంత స్థలం ఉండి కూడా గృహాలు లేని వారు, గుడిసెలు, మట్టి గోడలు, పైకప్పు లేని ఆవాసాలతో పాటు అద్దె ఇళ్లలో నివసించేవారు మాత్రమే అర్హులని తెలిపారు. వీరిలోనూ వితంతువులు, భూమిలేని వ్యవసాయ కూలీలు, పారిశుద్ధ్య కార్మికులు, దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈనెల 18లోగా ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు లాగిన్‌లో లోపాలు లేకుండా సూపర్ చెక్ పూర్తిచేయాలని ఆదేశించారు. ఒక కుటుంబానికి ఒకే ఇల్లు కేటాయించేలా చూడాలని సూచించారు. గ్రామ సభల నిర్వహణకు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందనతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సర్వజన ఆస్పత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ పాటిల్

పనులు త్వరగా పూర్తి చేయాలి

కొత్తగూడెంరూరల్: జిల్లా సర్వజన ఆస్పత్రిలో డ్రెయినేజీ పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. బుధవారం ఆయన సర్వజన ఆస్పత్రిని పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది విధులకు సక్రమంగా హాజరవుతున్నారా అని ఆరా తీశారు. ఓపీ విభాగంలో నిరుపయోగంగా ఉన్న ఎక్స్‌రే యంత్రాన్ని తొలగించాలని, కొత్త మిషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. వార్డుల్లో బెడ్‌లు మార్చాలని సూపరింటెండెంట్ రాధామోహన్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ నర్సింహారావు, ఆర్‌ఎంఓ రమేష్ పాల్గొన్నారు.

రెండు రోజులు.. రూ.1.88లక్షలు



కిన్నెరసానిలో సందడి చేస్తున్న పర్యాటకులు

- కిన్నెరసానికి పెరిగిన ఆదాయం
- రెండు రోజుల పాటు పోటెత్తిన పర్యాటకులు



పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కిన్నెరసానికి సంక్రాంతి సందర్భంగా మంగళ, బుధవారాల్లో పర్యాటకులు భారీగా పోటెత్తారు. దీంతో ఆ ప్రాంతమంతా సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా పర్యాటకులు డ్యామ్ పైనుంచి జలాశయాన్ని, డీర్‌పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. మొత్తంగా 3,614 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖ రూ.1,20,420 లభించగా, 1,300 మంది బోటు షికారు చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్‌కు రూ.67,770.. మొత్తం 1,88,190 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

పెద్దమ్మతల్లికి విశేష పూజలు

భారీగా తరలివచ్చిన భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి సంక్రాంతి సందర్భంగా విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు భారీగా తరలివచ్చారు. క్యూలైన్ల ద్వారా అమ్మవారిని దర్శించుకున్నారు. ఒడిబియ్యం, పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఈఓ రజనీకుమారి, వేద పండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కోడిపందేల నిర్వాహకులు అరెస్ట్

పినపాక: మండల పరిధిలోని టీ కొట్టుగూడెం గ్రామంలో కోడిపందేల స్థావరాలపై పోలీసులు బుధవారం దాడి చేశారు. 13 మందిని పందెంరాయుళ్లను అరెస్ట్ చేశారు. 16 బైక్‌లు, ఆటో, రూ.3 వేల నగదు, కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజ్ కుమార్ తెలిపారు.

పందెంకోళ్లు పట్టివేత

భద్రాచలంఅర్బన్: కోడి పందేలు ఆడేందుకు వెళ్తున్న పందెంరాయుళ్లను పోలీసులు పట్టుకున్నారు. వాహన తనిఖీల్లో ఐదుగురు పందెంరాయుళ్లను పట్టుకుని కేసు నమోదు చేశామని, ఆరు కోళ్లను స్వాధీనం చేసుకున్నామని పట్టణ ఎస్సై పీవీఎన్ రావు బుధవారం తెలిపారు.

'బొడ్రాయి'ని ఢీకొన్న కారు

అశ్వారావుపేటరూరల్: ఓ కారు అదుపుతప్పి బొడ్రాయిని ఢీ కొట్టిన ఘటన మంగళవారం అర్ధరాత్రి జరిగింది. మండలంలోని వినాయకపురం గ్రామ శివారులో బొడ్రాయిని నారాయణపురం వైపు నుంచి అశ్వారావుపేట వైపు వస్తున్న కారు అదుపు తప్పి ఢీకొట్టింది. దీంతో బొడ్రాయి చుట్టూ ఉన్న స్టీల్ గ్రిల్స్, దిమ్మె కొంతమేర ధ్వంసమయ్యాయి. కారు ముందు భాగం దెబ్బతిన్నది.

గురుకులం ప్రిన్సిపాల్ సస్పెన్షన్

ఇల్లెందు: ఇల్లెందు మైనారిటీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ భీమనపల్లి కృష్ణపై సస్పెన్షన్ వేటు పడింది. ఇటీవల ఆయన అదే పాఠశాలలో పని చేస్తున్న గెస్ట్ టీచర్ నుంచి రూ.2 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన విషయం విదితమే. దీంతో ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. రెగ్యులర్ టీజీటీ సోషల్ ఉపాధ్యాయుడు రహీంకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. కాగా ప్రిన్సిపాల్ లంచం తీసుకుంటూ పట్టుబడిన ఉదంతంతో ఇన్‌చార్జ్ బాధ్యతలు తీసుకునేందుకు, అక్కడ పని చేసేందుకు అధ్యాపకులు భయపడుతున్నట్లు ప్రచారం సాగుతోంది.

నర్సంపేటలో మిట్టగూడెం వాసి మృతి

అశ్వాపురం: వరంగల్ జిల్లా నర్సంపేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల పరిధిలోని మిట్టగూడెం గ్రామానికి చెందిన కణితి చంద్రమోహన్(65) మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. చంద్రమోహన్ కొంత కాలంగా నర్సంపేట సమీపంలోని మహేశ్వరంలో ఉంటున్నాడు. ఈ నెల 13న నర్సంపేట నుంచి నడుచుకుంటూ మహేశ్వరం వైపు వెళ్తున్నాడు. వెనుక నుంచి బైక్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతదేహాన్ని స్వగ్రామం మిట్టగూడెం తీసుకొచ్చి దహనసంస్కారాలు నిర్వహించారు.

వ్యక్తి అదృశ్యం

ఇల్లెందు: మండలంలోని ముకుందాపురం ఏరియా ఒడ్డుగూడెం గ్రామానికి చెందిన సూరంపల్లి వీరభద్రం(35) ఈ నెల 12న తన సెలూన్‌కు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లాడు. తిరిగి రాలేదు. పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. భార్య సాయిజ్యోతి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నాగుల్ మీరా పఠాన్‌ఖాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కేసు నమోదు

పాల్వంచరూరల్: అత్తపై దాడి చేసిన ఘటనలో అల్లుడిపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని శ్రీనివాసనగర్ కాలనీకి చెందిన జీడిమెట్ల పద్మ చిన్న కుమార్తె మౌనిక, భర్త కందుకూరి రామకృష్ణకు మధ్య మనస్పర్థలు వచ్చాయి. దీంతో మౌనిక తన ఆరు నెలల బిడ్డతో కలిసి ఇటీవల పుట్టింటికి వచ్చి ఉంటోంది. ఈ నెల 14న చిన్నల్లుడు రామకృష్ణ గోడ దూకి ఇంట్లోకి వచ్చాడు. ఆ సమయంలో అన్నం తింటున్న పెద్ద అల్లుడితో గొడవపడ్డాడు. ఈ క్రమంలో అత్త అడ్డుపడగా ఆమెను బూతులు తిడుతూ చంపుతానని బెదిరించాడు. కొట్టడంతో గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు రామకృష్ణపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సుమన్ తెలిపారు.

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మృతి



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కొణిజర్ల: మండలంలోని పెద్దగోపతికి చెందిన సీపీఎం సీనియర్ నాయకురాలు, తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు ఇనుకొండ గౌరమ్మ(98) బుధవారం మృతి చెందింది. కొద్ది రోజులుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతుండగా చికిత్స చేయిస్తుండగానే కన్నుమూసింది. ఆమెకు ఆరుగురు కుమారులు, నలుగురు కూతుళ్లు ఉన్నారు. ఈమేరకు గౌరమ్మ మృతదేహంపై సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. ఖమ్మం తాలూకాలో భర్త నారాయణతో కలిసి గౌరమ్మ పార్టీ నిర్మాణానికి కృషి చేశారని కొనియాడారు. నాయకులు మాదినేని రమేష్, తాళ్లపల్లి కృష్ణ, కుటుంబరావు, బి.శ్రీనివాసరావు, డి.కృష్ణ, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,506

పందేనికి పోతే.. పైసలు పోయే!



బరిలో దిగిన కోడిపుంజులు

జేబులు ఖాళీ చేసుకుని వచ్చిన పందెంరాయుళ్లు

- కోడి పందేలు, విచ్చలవిడి పేకాటతో అప్పులపాలు
- భారీగా దండుకున్న ఆంధ్రాలోని బిర్రుల నిర్వాహకులు



కోడి పందేలు వీక్షించేందుకు వెళ్లిన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



నూజివీడులో కోడి పందేలు తిలకిస్తున్న ఇల్లెందు, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, జారె ఆదినారాయణ, మువ్వా విజయబాబు తదితరులు

బూర్గంపాడు: సంక్రాంతి అంటేనే కోడిపందేలు అన్నట్లుగా పరిస్థితి మారిపోయింది. చిన్నపెద్దా తేడా లేకుండా మూడు రోజులపాటు అందరూ కోడిపందేల బిర్రుల వైపు పరుగు తీశారు. పండుగ ముగిసింది. జేబులు ఖాళీ అయ్యాయి. పందెంరాయుళ్లతోపాటు సరదాగా చూద్దామని వెళ్లిన వారుకూడా పందేలు కాసి చేతిచమురు వదిలిచ్చుకున్నారు. జిల్లాకు సరిహద్దుల్లోని ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న పలు ప్రాంతాల్లో భారీ ఎత్తున కోడిపందేలు సాగాయి. ఈ పందేలకు జిల్లా నుంచి వేలాదిమంది తరలివెళ్లారు. ఖమ్మం, వరంగల్, హైదరాబాద్ నుంచి కూడా వందలాదిమంది హాజరయ్యారు. బిర్రుల వద్ద భారీగా పేకాట క్లబ్‌లు నడిచాయి. కోడిపందేల కంటే పెద్దమొత్తంలో పేకాటలోనే చాలామంది డబ్బులు పోగొట్టుకున్నారు.

సరిహద్దుల్లో గ్రామగ్రామాన బిర్రులు..

జిల్లాలో కోడిపందేలు నిర్వహించకుండా పోలీసులు కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేశారు. మారుమూల ప్రాంతాల్లో కోడిపందేలు నిర్వహించినా పక్కా సమాచారంతో దాడులు చేశారు. నిర్వాహకులను, పందెంరాయుళ్లను పట్టుకున్నారు. జిల్లా సరిహద్దులోని ఆంధ్రా గ్రామాల్లో కోడిపందేలకు ప్రభుత్వపరంగా అనధికారికంగా అనుమతులుండటంతో భారీ ఎత్తున బిర్రులు ఏర్పాటు చేశారు. ఒక్కో గ్రామంలో నాలుగైదు బిర్రులు కూడా నిర్వహించారు. తెలంగాణ నుంచి వస్తున్న పందెంరాయుళ్లను దృష్టిలో ఉంచుకుని బిర్రుల సంఖ్యను పెంచారు. కోడిపందేలా నిర్వహణతో అక్కడి టీడీపీ, జనసేన నాయకులు భారీగా సొమ్ము చేసుకున్నారు. గ్రామాల్లో టీడీపీ, జనసేన పార్టీల ఆధ్వర్యంలో వేర్వేరుగా బిర్రులు ఏర్పాటు చేశారు.

చేతులు మారిన రూ. కోట్లు

కోడిపందేల కోసం పందెంరాయుళ్లు భారీగా అప్పులు చేశారు. బూర్గంపాడుకు సమీపంలోని వేలేరులో ఏర్పాటు చేసిన రెండు బిర్రుల్లో సుమారు రూ.2 కోట్ల వరకు చేతులు మారినట్లు తెలుస్తోంది. నిర్వాహకులకు రూ.లక్షల ఆదాయం చేకూరిందని ప్రచారం సాగుతోంది. తెలంగాణ నుంచి ఆంధ్రాకు కోడిపందేలకు వెళ్తున్న వారి వాహనాలను పోలీసులు అక్కడక్కడా తనిఖీలు చేసి వెనక్కి పంపినా.. వారు వేరే మార్గాల్లో బిర్రులకు చేరుకున్నారు. మరికొందరు నూజివీడు, భీమవరం, తిరువూరు, జంగారెడ్డిగూడెం ప్రాంతాలకు తరలివెళ్లారు.

నూజివీడు, భీమవరం ప్రాంతాలకు...

దమ్మపేట : మండలానికి సరిహద్దులోనున్న ఏపీలోని జిల్లాల్లో భారీగా కోడి పందేలు నిర్వహించారు. మూడు రోజులపాటు నిర్వహించిన ఈ పందేలకు మంగళ, బుధవారాల్లో మండలం నుంచి వేలాదిగా యువత, పెద్దలు తరలివెళ్లారు. ఏపీలోని కొప్పాక, నూజివీడు, భీమవరం, రాఘవాపురం, తిరువూరు, కామయ్యపాలెం, జంగారెడ్డిగూడెం తదితర ప్రాంతాల్లో భారీగా పందేలు నిర్వహించారు. కోడి పందేలు, గుండు పట్టాలు, కోసు ఆట తదితర జూద క్రీడల్లో రూ.కోట్లు చేతులు మారాయి.

ఎమ్మెల్యేలు సైతం

కోడిపందేలను వీక్షించేందుకు జిల్లాలోని ఎమ్మెల్యేలే వెళ్తుండటంతో పోలీసులు కూడా చేతులెత్తేశారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కోడిపందేల బిర్రుల వద్ద సందడి చేయటం గమనార్హం. తెలంగాణ పోలీసులు కోడిపందేల నిర్వహణను అడ్డుకుంటుంటే ప్రజాప్రతినిధులు మాత్రం కోడి పందేలను ఎంజాయ్ చేస్తున్నారని పలువురు చర్చించుకుంటున్నారు.

బైకర్లకు.. మాంజా డేంజర్

- 15 రోజుల్లో కొత్తగూడెంలో ఐదుగురికి గాయాలు
- గాయపడ్డ వారందరూ బైక్‌లపై వెళ్తున్నవారే
- చైనా దారంపై నిషేధం ఉన్నా అమలు చేయని అధికారులు



రామవరంలో గాయపడిన కృష్ణారావు



చిట్టి రామవరంలో గాయపడిన తమన్



కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లో గాయపడిన చరణ్

కొత్తగూడెంటౌన్: సంక్రాంతి పండుగ అందరికీ సరదా సంతోషాలను తీసుకొస్తే కొందరికి మాత్రం మాంజా దారంతో గాయాలు చేసింది. జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం, రామవరం, చిట్టి రామవరం, పాల్వంచ ప్రాంతాలకు చెందిన ముగ్గురు మాంజాతో గాయపడ్డారు.

- పతంగికి ఉన్న మాంజా దారం చంద్రుగొండ మండలానికి చెందిన ఏరువ కృష్ణారావును ప్రాణాపాయానికి గురిచేసింది. ఈ నెల 1న ద్విచక్ర వాహనంపై కొత్తగూడేనికి వస్తుండగా రామవరంలో జాతీయ రహదారిపై మాంజా దారం తెగి అతని గొంతును కోసుకుపోయింది. తీవ్రగాయమై రక్తస్రావం జరుగుతుండటంతో స్థానికులు బాధితుడిని కొత్తగూడెంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం కృష్ణారావు చికిత్స పొందుతున్నాడు.
- ఈ నెల 13న చిట్టి రామవరానికి చెందిన ఆటో డ్రైవర్ బాదవత్ రమేష్ కుమారుడు తమన్‌కు మాంజా దారంతో కాలుకు తీవ్రగాయమైంది. తమన్ బంధువుతో కలిసి రామవరం మార్కెట్ నుంచి ద్విచక్ర వాహనంపై వస్తుండగా మాంజా దారం తెగి బాలుడి ఎడమ కాలికి కోసుకుంది. కొత్తగూడెంలోని జిల్లా సర్వజన ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాలికి దాదాపు 32 కుట్లు వేశారు.
- కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లో ద్విచక్ర వాహనంపై వస్తున్న సుజాతనగర్‌కు చెందిన రాజు కుమారుడు చరణ్‌కు పాదం వద్ద మాంజా దారం తెగడంతో తీవ్ర రక్తస్రావమైంది. స్థానికులు, పోలీసులు అతనిని చికిత్స నిమిత్తం కొత్తగూడెం జిల్లా ఆస్పత్రికి పంపగా కాలికి మూడు కుట్లు వేశారని బంధువులు, స్థానికులు తెలిపారు.
- కొత్తగూడెం విద్యానగర్ కాలనీ బైపాస్ రోడ్డులో చైనా మాంజా తెగడంతో దంపతులకు స్వల్పగాయాలయ్యాయి. పాల్వంచకు చెందిన భూక్య నవీన్, సుప్రజ దంపతులు ద్విచక్ర వాహనంపై బుధవారం పాల్వంచ నుంచి జూలూరుపాడుకు వస్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదం జరిగింది. నవీన్ గొంతుకు గాయం కాగా, సుప్రజకు చేతి వేళ్లకు గాయమైంది.

రహస్యంగా విక్రయిస్తున్న వ్యాపారులు

జిల్లాలో చైనా మాంజా దారం విక్రయాలను అరికట్టాలని పోలీసులు, అధికారులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదనే విమర్శలు ఉన్నాయి. మాంజా దారం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కొత్తగూడెం పోలీస్ సబ్ డివిజన్ పోలీసులు హెచ్చరించినా వ్యాపారులు పట్టించుకోవడం లేదు. మాంజాను రహస్యంగా అమ్మకాలు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. సంక్రాంతి పండుగ సెలవులు ఇంకా రెండు, మూడు రోజులు ఉండటంతో గాలిపటాలను ఎగురవేసేందుకు పిల్లలు, పెద్దలు ఉత్సాహం చూపుతారని, ఇప్పటికైనా అధికారులు చైనా మాంజాను పూర్తిస్థాయిలో అమ్మకుండా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

పండుగ వేళ.. నాలుగు తరాల కలయిక



సంక్రాంతి పండుగను ఓ కుటుంబానికి చెందిన నాలుగు తరాల వారు స్వగ్రామంలో ఆనందోత్సవాలతో ఘనంగా జరుపుకున్నారు. అశ్వాపురం మండలం అమ్మగారిపల్లికి చెందిన గాదె కేశవరెడ్డి ఆయన సోదరులు, సోదరీమణులు, వారి కుటుంబసభ్యులు ఏళ్లుగా వృత్తి, వ్యాపారాల రీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. అప్పుడప్పుడు వేడుకలకు కలుస్తున్నా ఎవరో ఒకరికి కుదరడం లేదు. ఈసారి సంక్రాంతికి అంతా ఎలాగైనా కలుసుకోవాలని నిర్ణయించుకున్న కుటుంబంలోని నాలుగు తరాల వారు అమ్మగారిపల్లి చేరుకున్నారు. ఈసందర్భంగా మూడు రోజుల పాటు పండుగను ఆనందంగా జరుపుకున్నారు. – అశ్వాపురం

ప్రైవేట్ ఆస్పత్రిలో అగ్ని ప్రమాదం



దగ్ధమైన ఆపరేషన్ థియేటర్

పాల్వంచరూరల్: షార్ట్ సర్క్యూట్ కారణంగా పట్టణంలోని శ్రీరక్ష ప్రైవేట్ ఆస్పత్రిలో సంక్రాంతి రోజున అగ్నిప్రమాదం సంభవించి ఆపరేషన్ థియేటర్, ల్యాబ్‌లోని వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఆస్పత్రిలో మంగళవారం సాయంత్రం షార్ట్ సర్క్యూట్ ఏర్పడి పేలుడు శబ్దం వినిపించింది. పొగలు, మంటలు ఎగిసిపడటంతో ఆస్పత్రి సిబ్బంది గ్యాస్ సిలిండర్ల సాయంతో మంటలను ఆర్పివేశారు. కేటీపీఎస్ నుంచి ఫైరింజన్ వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. అప్పటికే ఆపరేషన్ థియేటర్, ల్యాబ్‌లోని వైద్యపరికరాలు కాలిబూడిదయ్యాయి. ప్రమాద సమయంలో ఆస్పత్రిలో పేషెంట్లు ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. సుమారు రూ. 4 లక్షల ఆస్తి నష్టం జరిగిందని డాక్టర్ రాంప్రసాద్ తెలిపారు.

బస్టాండ్‌కు వెళ్తూ యువకుడి అదృశ్యం

- తనికెళ్ల లాక్‌ల వద్ద లభ్యమైన మృతదేహం
- హత్య చేశారంటూ కుటుంబీకుల ధర్నా



సంజయ్‌కుమార్ (ఫైల్)



రాస్తారోకో చేస్తున్న సంజయ్ కుటుంబీకులు, స్థానికులు

ఖమ్మంరూరల్: ఖమ్మంరూరల్ మండలం పోలేపల్లి పరిధి రాజీవ్ గృహకల్పకు చెందిన పందెపు సంజయ్‌కుమార్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అయితే, ఆయనను గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారంటూ కుటుంబీకులు ఆందోళనకు దిగారు. ఓ మహిళను సదరు వ్యక్తులు ఆటోలో తీసుకెళ్తుండగా ఆమె కేకలు వేయడంతో కాపాడే యత్నంలో సంజయ్ హత్యకు గురయ్యాడని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. తన సోదరుడైన జ్ఞానసాయి హైదరాబాద్ నుండి బస్సులో వస్తుండగా ఆయనను తీసుకొచ్చేందుకు ఖమ్మం కొత్త బస్టాండ్‌కు ఈనెల 13న అర్ధరాత్రి ఒంటి గంటకు బైక్‌పై బయలుదేరిన సంజయ్ ఆతర్వాత కానరాకుండా పోయాడు. అప్పటి నుంచి పోలీసులు, కుటుంబీకులు గాలిస్తుండగా 14న మంగళవారం సాయంత్రం తనికెళ్ల సమీపాన సాగర్ కాల్వ లాక్‌ల వద్ద మృతదేహమై కనిపించాడు. దీంతో రాత్రి ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించగా బుధవారం ఉదయం పోస్టుమార్టం చేసి కుటుంబీకులకు అప్పగించారు.

మృతదేహంతో రాస్తారోకో

సంజయ్‌ను నలుగురు యువకులు హత్య చేశారని, నిందితులను అరెస్ట్ చేయాలంటూ ఆయన కుటుంబీకులు మృతదేహంతో కరుణగిరి వద్ద ఖమ్మం – వరంగల్ రహదారిపై రాస్తారోకో చేశారు. అమ్మ చికెన్ సెంటర్ వద్ద ఆటోలో ఓ మహిళ తనను రక్షించండని కేకలు వేయడంతో ఆయన ఆటోను వెంబడించాడని, అందులోని ఆగంతకులు సంజయ్‌ను కొట్టి హత్య చేశారని ఆరోపించారు. ఆ సమయంలో సంజయ్ తన సోదరుడు జ్ఞానసాయికి పంపిన వాయిస్ మెసేజ్‌లో 'అన్నా నన్ను చంపుతున్నారు.. కాపాడు' అంటూ చెప్పాడని దీంతో తాము సంజయ్ చెప్పిన ప్రాంతానికి వెళ్లేసరికి ఎవరూ లేరన్నారు. సంజయ్‌ను కొట్టి హత్య చేసి కాల్వలో పడేశారని, నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి చేరుకుని వారికి నచ్చచెప్పేందుకు యత్నించగా ససేమిరా అన్నారు. ఆ కాసేపటికి మళ్లీ చర్చించిన ఏసీపీ ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని, రహదారిపై బైఠాయించి ఇతరులను ఇబ్బంది పెట్టొద్దని సూచించడంతో వారు రాస్తారోకో విరమించారు. కాగా, సంజయ్‌కు ఇటీవల బెంగుళూరులో ఉద్యోగం వచ్చిందని, సంక్రాంతి తర్వాత వెళ్లే ఏర్పాట్లు చేసుకుంటుండగా ఇలా జరిగిందని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

ఆమె ఎవరు?

ఇదిలా ఉండగా ఆటోలో నలుగురు ఆగంతుకులు ఓ మహిళను తీసుకెళ్తుండగా ఆమె కేకలతో సంజయ్ వెండించినట్లు తెలుస్తోంది. ఆపై తనను కొట్టి చంపుతున్నారని, ఆ మహిళను చంపేశారని ఆయన తన సోదరుడికి వాయిస్ మెసేజ్ పంపించాడు. అయితే, ఇప్పటివరకు మహిళ మృతదేహం ఎక్కడా లభించకపోగా, తప్పిపోయినట్లు కూడా పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెబుతున్నారు. దీంతో ఘటనపై మరింత లోతుగా విచారించేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. కాగా రాజీవ్ గృహకల్ప వద్ద గురుదత్త ఫౌండేషన్ సమీపంలో కాల్వకట్ట కేంద్రంగా అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి.

పోటీల నిర్వహణ అభినందనీయం



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు

బూర్గంపాడు: నైపుణ్యాలను మెరుగుపరిచేలా పోటీలు నిర్వహించడం అభినందనీయమని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. బూర్గంపాడు మండలంలోని మోరంపల్లిబంజరలో సంక్రాంతి సందర్భంగా రెండు రోజులుగా నిర్వహిస్తున్న ట్రాక్టర్ ట్రాలీ రివర్స్ పోటీలు బుధవారం ముగియగా ఆయన విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడారు. రైతులు, ట్రాక్టర్ డ్రైవర్లలో నైపుణ్యాలు గుర్తించి ప్రోత్సహించేలా ఈ పోటీలు ఉపయోగపడతాయని తెలిపారు. కాగా, 8 అడుగుల వెడల్పు, 320 అడుగుల పొడవు స్థలంలో ట్రాక్టర్ ట్రాలీని రివర్స్ చేసే పోటీలను స్థానికులు ఆసక్తిగా తిలకించగా 50మందికి పైగా డ్రైవర్లు పాల్గొన్నారు. రెండు నిమిషాల వ్యవధిలో 11మంది డ్రైవర్లు ట్రాలీని రివర్స్‌లో పెట్టగా, జింకల సుందరరామిరెడ్డి, బొర్రా శ్రావణ్, మడకం రాజు మొదటి మూడు స్థానాల్లో నిలవడంతో వరుసగా రూ.10వేలు, రూ.5వేలు, రూ.3వేల నగదు బహుమతితో పాటు ట్రోఫీలు అందజేశారు. పోటీల నిర్వాహక కమిటీ అధ్యక్షుడు సోము ఆదిరెడ్డి అధ్యక్షన జగిగిన సమావేశంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు దుగ్గెంపూడి కృష్ణారెడ్డితో పాటు కైపు లక్ష్మీనారాయణరెడ్డి, పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి తదితరుల పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



అప్పారావు (ఫైల్)

ఎర్రుపాలెం: మండలంలోని నర్సింహాపురం గ్రామానికి చెందిన గంతాల అప్పారావు(29) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎర్రుపాలెం రైల్వేస్టేషన్‌లోని ఫ్లాట్‌ఫాంపై ఆయన మంగళవారం తాగి ఆత్మహత్యకు పాల్పడగా జీఆర్పీ ఎస్‌ఐ భాస్కరరావు, మృతుడి భార్య అశ్విని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులోని వివరాలిలా ఉన్నాయి. అప్పారావు తన గ్రామానికే చెందిన శీలం శ్రీనివాసరెడ్డి వద్ద కొంత అప్పు తీసుకుని తీర్చేసినా ఇంకా చెల్లించాల్సి ఉందని శ్రీనివాసరెడ్డి ఒత్తిడి తీసుకొచ్చాడని తెలిసింది. అలాగే, గ్రామానికి చెందిన యరమల శ్రీనివాసరెడ్డి, యరమల జనార్దన్‌రెడ్డి కూడా అప్పారావుపై అప్పు విషయమై ప్రచారం చేయడంతో ఆయన మనస్థాపానికి గురైనట్లు సమాచారం. ఈమేరకు ఆయన మంగళవారం ఎర్రుపాలెం రైల్వేస్టేషన్‌కు వచ్చి పురుగుల మందు తాగడంతో గమనించిన స్థానికులు స్థానిక ఆస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఘటనపై ఆయన భార్య ఫిర్యాదుతో ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భాస్కరరావు తెలిపారు.